# త్రోవ వెదకు కొనుట దొడ్డబుద్ధి

ప్రేమ స్వరూపులారా!

తల్లి, తండ్రి, గురువు, దైవము అనే పదములను మనము నిరంతరము జ్ఞప్తియందుంచుకోవాలి. వీటి క్రమమునకు ఒక విధమైన అంతరార్థము ఉంటున్నాది. అంతరార్థములేని పదములు ఈ జగత్తులో కానరావు. ప్రతి జీవికి తల్లి, తండ్రిని చూపుతుంది. తండ్రి గురువును చూపుతాడు. గురువు దైవమును చూపుతాడు. తల్లి, తండ్రి, గురువు మరియు దైవము ఈ నాల్గింటియొక్క అంతరార్థాన్ని ప్రతి ఒక్క వ్యక్తికూడను గుర్తించాలి. అదేవిధముగా ఆధ్యాత్మిక మార్గమునందు భక్తి, జ్ఞానము, వైరాగ్యము మరియు తత్త్వములయొక్క అంతరార్థముల గురించి తెలుసుకోవాలి. భక్తి, జ్ఞానమును కలిగిస్తుంది. జ్ఞానము, వైరాగ్యాన్ని పెంపొదిస్తుంది. ఈ వైరాగ్యమే తత్త్వజ్ఞానాన్ని ప్రబోధిస్తుంది. ఈ నాల్గింటిని మనము ఆచరించిన, ముక్తి మార్గమునకు చేరువౌతాము. ఇందులకు భాగవతము ప్రత్యక్ష ప్రమాణము. భాగవతము అనగా 'భా', 'గ', 'వ', 'త', 'ము'. 'భ' కారము భక్తికి సంకేతము. 'గ' కారము జ్ఞానమునకు సంకేతము. 'వ' కారము వైరాగ్యానికి సంకేతము. 'త' కారము తత్త్వమునకు సంకేతము. 'ము' కారమే ముక్తికి మార్గము. కనుక భాగవతము అనేది 'భక్తి, జ్ఞానము, వైరాగ్యము, తత్త్వముచేత ముక్తిని అందించేటువంటిది', అని దీని అంతరార్థము. ప్రహ్లాదుడుకూడా ఒక మంత్రోపదేశము చేశాడు.

**దీన శుభము లేదు దివ్య కీర్తియు లేదు**
**జగతి పుట్టిపుట్టి చచ్చిచచ్చి**
**పొరలనేల మరల బుట్టని చావని**
**త్రోవ వెదకుకొనుట దొడ్డబుద్ధి.**

srisathyasaivachanamrutam

'త్రోవ వెదకుకొనుట దొడ్డబుద్ధి', ఇదే ద్వాదశాక్షరి మంత్రము. ఎక్కడనుండి వచ్చితివో అక్కడికి పోవటం. ఎక్కడనుండి వచ్చావు? బ్రహ్మనుండి వచ్చావు. కనుక బ్రహ్మమునకే చేరాలి. వచ్చిన త్రోవలోనే పోవాలి. బ్రహ్మనుండి వచ్చామనటానికి ఆధారము ఏమిటి? 16వ అధ్యాయమునందు 7వ శ్లోకములో 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః' అన్నాడు, కృష్ణుడు. "జీవుడవైన నీవు నా అంశమే! నీవు ప్రకృతియొక్క అంశము కాదు, పంచభూతములయొక్క అంశముకాదు, సాక్షాత్తు నా అంశమే! నా అంశమైన నీవు నాలో చేరుకునేంతవరకు శాంతిని పొందలేవు. బిడ్డ, తల్లికి అంశము. తల్లిని వదలి బిడ్డ బ్రతకలేదు. కొమ్మ, చెట్టుకు అంశము. చెట్టును వదలి కొమ్మ బ్రతుకలేదు. చేప, జలమునకు అంశము. జలములేక చేప క్షణమైన జీవించలేదు. అదే విధముగా నీవు నా అంశము. కాబట్టి, నేనులేక నీవు బ్రతకలేవు. కనుక, నన్ను చేరుటకై నీవు ప్రయత్నించు", అన్నాడు.

**ఈనాడు మనము ఎక్కడనుండి వచ్చితిమో ఆ విషయం మరచిపోయాము**

అదేవిధముగా కన్నడమునందు ఒక భక్తుడు చెప్పాడు: "నిన్ను మరచి నేను ధరణిలోన చేరినాను. చిన్మయమైన నిన్ను వదలి మృణ్మయమైన భూమిలో పడ్డాను. ఈ మట్టియందు నాకు ఎట్టి ఆనందము లభించదు. నీయందే సర్వానందము యున్నద"ని చెప్పాడు. భగవంతుని మరచిపోయినందునే ప్రకృతియందు జన్మములు ఏర్పడుతున్నాయి. ఎక్కడనుండి వచ్చితివో అక్కడికి చేరుట నిజము. ఇదియే భాగవతముయొక్క ప్రధానమైన బోధ. ఈనాడు మనము ఎక్కడనుండి వచ్చితిమో ఆ విషయము మరచిపోయాము. మరచిపోవటమనేది మనయొక్క ప్రారబ్ధము. అది తెలుసుకొని దైవాన్ని చేరుకోవటమే ప్రధానమైన సాధన. ఆత్మను వెతుకుటకొరకై వచ్చిన మానవుడు ఈనాడు అన్నాన్ని వెతుకుటకొరకై కాలాన్ని వ్యర్థము చేసుకుంటున్నాడు. కనుకనే, మానవునియొక్క బుద్ధి గొడ్డుబుద్ధి అన్నారు. కనుక, సాధనచేసి బ్రహ్మను చేరాలి. ఆహారనిద్రాభయమైథునాదులు పశుపక్ష్యాదులుకూడను అనుభవిస్తున్నాయి, మానవుడుకూడను అనుభవిస్తున్నాడు. వీటి నిమిత్తమై మానవుడు రాలేదు. 'జంతూనాం నరజన్మ దుర్లభం'. ఉత్తమమైన మానవజన్మము కేవలము దైవత్వాన్ని గుర్తించుకునే నిమిత్తము వచ్చింది. ఆ సాధనలోనే మానవుడు

srisathyasaivachanamrutam

తనయొక్క శక్తిసామర్థ్యములు అంత్యము గావించాలి. చైతన్యుడుకూడా చెప్పాడు. సద్గుణములతో నింపుకోవలసిన మానవ హృదయము ఈనాడు దుర్గుణములతో నింపుకుంటున్నారు. హృదయపీఠం భగవంతునియొక్క నివాసము. దుర్గుణములు, దురాలోచనలు, దుర్భావములయొక్క నివాసము కాదు. అట్టి హృదయాన్ని పవిత్రమైనటువంటి పరమాత్మ పీఠంగా ఏర్పరుచుకోవాలి. సంసారము వదలమని కాదు. మనవెంట వచ్చేది సంస్కారము, సంసారము కాదు. మనము ఏదైనా పనిమీద పట్టణము వెళ్లునపుడు హోటలులో రెండు, మూడు దినములు యుంటాము. పని పూర్తి అయిన తరువాత తిరిగి మన స్వస్థలమునకు చేరుకుంటాము. అంతేగాని ఆ హోటలే మనకు శాశ్వతమని అక్కడ వుండిపోము. యీ ప్రకృతి మనకు హోటలు వంటిది. మన కర్మ నిమిత్తమై యిక్కడకు వచ్చాము. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ స్సనాతనః. దేహము పట్టణము వంటిది. పనిపూర్తి అయిన వెంటనే వెడలిపోయినట్లు పంచభూతములతో కూడిన ఈ దేహమును విడిచిపెట్టక తప్పదు. ఎంతకాలము వుంటుందో ఎవరికి తెలియదు.

**పాంచభౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**
**శత వర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎఱుక లేదు**
**మరణమే నిశ్చయమ్మది మానవునకు**
**బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె**
**తన్ను తా తెలియుట ధర్మతత్వ మరయ**
**సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట!**

srisathyasai vachanamrutam

మన జీవితముయొక్క లక్ష్యాన్ని గుర్తించే నిమిత్తమై ఈ కాయాన్ని వుపయోగించాలి. ధనార్జన నిమిత్తమై మనము ప్రాకులాడుతున్నాము. దేనికైనా ఒక హద్దు వుంటుండాలి. హద్దు దాటితే అది మెద్దుగా తయారౌతుంది. కనుక హద్దులోనే మన జీవితాశయమును సాధించుకోవాలి. ఏదీ మనవెంట రాదు. తాత్కాలికమైన జీవితము గురించి ఆలోచించి మనము కాలాన్ని వ్యర్థం చేసుకుంటున్నాము. మన కర్తవ్యమును మరచిపోతున్నాము. అన్నపానాదుల గురించి కాలము వ్యర్థము చేయకూడదు. మన ఆయుఃప్రమాణము మంచుగడ్డవలె ఆవిరై కరిగిపోతున్నది. మృత్యుదేవత ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలియదు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

**చేతులతో కర్మను ఆచరించాలి, నోటితో హరినామస్మరణ చెయ్యాలి**

ఇలాంటి సత్యాన్ని మనము గుర్తించాలి. మన జీవితము అంధకారములోనే వ్యర్థము చేయడం సార్థకము కానేరదు. ప్రతి మానవునకు ప్రధానమైనటువంటిది భక్తి. భక్తికి నిదర్శనము తల్లి. జ్ఞానమునకు నిదర్శనమే తండ్రి. వైరాగ్యమునకు నిదర్శనమే గురువు. తత్త్వస్వరూపుడే దైవము. ఈ నాల్గింటిని సక్రమముగా పాటించినపుడే మనకు ముక్తిమార్గము లభిస్తుంది. తల్లి ప్రేమను అభివృద్ధి గావించుకోవాలి. యీనాడు మానవుడు వస్తువాహనాదులను ప్రేమిస్తున్నాడు. కాని, మన హెడ్, ఫుడ్, బ్లడ్‌కు కారణమయిన తల్లితండ్రులను ప్రేమించడంలేదు. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' అన్నారు. అన్నింటిలోను ప్రథమమైనది తల్లి. కనుక, ప్రతి మానవునకు తల్లియే గురువు. బిడ్డలను ప్రేమించి, పోషించి ఉన్నతస్థాయిలోకి అభివృద్ధిని చేకూర్చేది తల్లి ఒక్కతే! తల్లిని విస్మరించి ఆస్తిపాస్తులకోరకై ప్రాకులాడుతున్నారు. తల్లి గర్భమునకు చేటుగా పుట్టకూడదు. తల్లి గర్భమునకు సంతృప్తినిచ్చెడిదిగా పుట్టాలి.

**చేతులారంగ శివుని పూజింపడేని**

srisathyasaivahini.org

**నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని**
**పుట్టనేటికి తల్లుల కడుపుచేటు**

ఇందులోనే కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యతత్త్వములు ఇమిడి వుంటున్నవి. ప్రతి మానవునకు కర్మ ప్రధానమైనది. కాబట్టి, కర్మను ఆచరించటానికి ప్రయత్నించాలి. 'చేతులారంగ శివుని పూజింపడేని' చేతులతో శివుని పూజించాలి, ఇదే మన కర్మ. దీనియొక్క భావము, పవిత్రత అనుగుణముగా వుంటుండాలి. మనము చేతులతో పని చెయ్యాలి. మనకు రెండు చేతులిచ్చాడు, ఒక పొట్టనిచ్చాడు. రెండు చేతులతో పనిచేస్తే పొట్టనిండదా? ఈనాడు మానవుడు చేతులనిండా పని చేయడంలేదు. కాని, పొట్ట నింపుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఇది సోమరత్వానికి నిదర్శనము. సోమరికి భుజించడానికి అధికారము లేదు. మొట్టమొదట పనిచేయాలి. ఇదే వేదములందు కర్మమార్గముగా వర్ణించారు. కనుక, మనము చేతులద్వారా కర్మను ఆచరించాలి. నోటిద్వారా హరిని చింతించాలి, కీర్తించాలి. నాలుకతో పరులను దూషించరాదు. ఇతరులను నొప్పించరాదు, బాధించరాదు. మన పదములు చాలా పవిత్రమైనవిగా యుంటుండాలి. ఎవరు ఇతరులను దూషిస్తారో వారి భావములు దిగజారిపోతాయి. 'ఈశావాస్య మిదం సర్వం'. అందరి హృదయములందు భగవంతుడు వుంటున్నాడు. తమను తాము గుర్తించుకోలేకపోయినప్పుడు దైవాన్ని ఏవిధంగా గుర్తిస్తారు? పరులను నిందించరాదు. అది మహా పాతకము.

**కలియుగంలో నామస్మరణయే పవిత్రమైన మార్గము**

కనుకనే జయదేవుడు 'ఓ నాలుకా! అందమైన నాలుకా! సత్యమును పలికే నాలుకా! సన్మార్గములో పెట్టే నాలుకా! గుణములను కాపాడే నాలుకా! నీవు నీ కర్తవ్యమును విస్మరించడం న్యాయముకాదు. పరులను బాధించటము న్యాయముకాదు. నీవు అపకీర్తిపాలు చేసుకుంటున్నావు' అని మార్గాన్ని బోధించాడు. నాలుక ఎంత పవిత్రమైనదో అర్థము చేసుకోండి. ఏదైనా పదార్థములు తీసుకున్నప్పుడు తాను ఏమీ వుంచుకోదు. మధురముగా వుంటే జఠరాగ్నికి పంపిస్తుంది, చేదుగా వుంటే బయటకు పంపిస్తుంది. కాని,

sri sathyasai vahini

తాను ఆరగించదు. ఈ విధమైన త్యాగాన్ని బోధిస్తున్నది, నాలుక. కఠినమైన 32 దంతములమధ్య సున్నితముగా సహనముతో వుంటుంది. జాగ్రత్తగా వుంటుండాది. అటువంటి పవిత్రమైన నాలుకతో అపవిత్రమైన పదములు పలకటం మంచిదికాదు. నాలుకను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టితే దైవాన్ని పొందవచ్చు. 'స్మరణే తరణోపాయమ్'. భగవంతుని నామము నాలుకపైన నాట్యమాడించుకోవాలి. ప్రతి మానవుడుకూడా మాటలను అతి జాగ్రత్తగా వుపయోగించుకోవాలి. ఏ విధముగా వుపయోగించుకోవాలి? సత్యమునే పలకాలి. కఠినమైనటువంటి పదములు వాడరాదు. పవిత్రమైన పదములు వాడాలి. అంతేకాదు, నాలుకచేసే నాలుగు పాపములు వుంటున్నాయి. అసత్యం పలకడం, చాడీలు చెప్పడం, పరులను దూషించడం, అతిభాష మాట్లాడడం. ఈ నాల్గింటిని అరికట్టుకుంటే మన నాలుకను పవిత్రము చేసుకున్నట్లే! కనుకనే అపవిత్రమైన మార్గములో ఈ నాలుకను ప్రవేశపెట్టకుండా పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. ఈ కలియుగములో సార్థకమైన, దివ్యమైన, భవ్యమైన, పవిత్రమైన మార్గము కేవలము నామస్మరణమే! కుమారుని పెంచి, పెద్దకావించి, మంచి సంస్కారములు, కీర్తి, మర్యాదలు నేర్పినటువంటి మాతృప్రేమను హృదయమునందు పదిలము గావించుకోవాలి. మాతృప్రేమకు దూరమైనట్టి వ్యక్తి ఏ యితర ప్రేమలను పొందలేడు.

## 'కోహం'నుండి ప్రారంభించి 'సోహం'తో అంత్యము కావాలి

పుండరీకుడు తన తల్లితండ్రులు భుజించి, సేదతీరిన తరువాత తాను భుజించడమనే వ్రతమును ఆచరించుకుంటూ వచ్చాడు. పుండరీకునియొక్క మాతృప్రేమను పరిక్షించగోరి పాండురంగడు మారువేషంలో వచ్చి 'పుండరీకా! నన్ను చూడు', అన్నాడు. అప్పుడు 'నా తల్లిని చూస్తున్నాను', అని బదులు చెప్పాడు పుండరీకుడు. ఇంతలో పుండరీకుని గురువు వచ్చి 'అక్కడ భగవంతుడు దర్శనమిస్తుంటే నీవు తల్లిని చూస్తున్నావు అని బదులివ్వడం సరిగాదు' అన్నాడు. 'నాకు తల్లి తరువాతనే భగవంతుడు' అని బదులిచ్చాడు, పుండరీకుడు. 'ఒక్కతూరైనా నన్ను చూడవా! దర్శించడానికి ప్రయత్నించవా' అని అడిగాడు,

sri sathyasaivachanamrutam

పాండరంగడు. 'నా తల్లి నిద్రించనంతవరకు నిన్ను దర్శించను. ఒకవేళ నీవు దర్శనము యివ్వాలని అనుకుంటే అంతవరకు నీవు అక్కడ రాతిపైన నిలబడు', అన్నాడు. మాతృభక్తిని పరిక్షించగోరి వచ్చిన పాండురంగడు, పుండరీకునికి సేవకుడయ్యాడు. మానవత్వము భవిష్యత్తులో ఏ విధముగా మారుతుందనేటువంటిది పుట్టుకతోనే ప్రారంభమవుతుంది. తల్లి గర్భమునుండి పుట్టిన తక్షణమే 'క్వా, క్వా' ఎక్కడ, ఏక్కడ, ఎక్కడ నా స్థానము అని ఏడుస్తాడు. దినదినమునకు మోహము పెరిగి, పెళ్లి చేసుకుని సంసారములో మునిగి, తాత్కాలిక సంతోషముతో ప్రాపంచిక మాయలో పడి ఇదే శాశ్వతము అని తనయొక్క స్వస్థానము మరచిపోతున్నాడు. ఇది సరికాదు. 'సోహం' తోనే పుట్టినటువంటివారు ప్రహ్లాదుడు, ధ్రువుడు, వాసుదేవుడు. సామాన్యమైనటువంటి మానవులు 'కోహం, కోహం' అని పుడతారు. 'కోహం'నుండి ప్రారంభించి 'సోహం'తో అంత్యము కావాలి. నేను ఎవరు? నేను ఎవరు?. ఆ 'నేను' తెలుసుకో! 'నేను ఎవరు' అని జీవితకాలమంతా ప్రశ్నించుకుంటున్నప్పటికి, 'నేను దేవుడను' అనే భావము రావడంలేదు. మనము దేనికోసం వచ్చాము, ఏమి చేస్తున్నాము? వచ్చిన పని ముగించుకోవాలి. ఈ జగత్తులోపల సర్వత్రా దైవత్వాన్ని గుర్తించాలి. పవిత్రముగా జీవించాలి, ఆధ్యాత్మిక జీవితము గడపాలి, జీవితము ధన్యము గావించుకోవాలి. అదియే భక్తి, జ్ఞాన, వైరాగ్యతత్త్వములు బోధించినటువంటి తల్లి, తండ్రి, గురువు, దైవము. ఇదియే మనయొక్క గమ్యము. కనుక ప్రతి మానవుడు తెలిసో, తెలియక అపచారములు జరిగినప్పటికి తల్లియొక్క భావములు గుర్తించి తన జన్మను సార్థకము గావించుకోవాలి. తల్లితండ్రులను మనము ప్రేమించడం కేవలము ఆస్తిపాస్తులకోసము కాదు. గొప్ప ఆస్తి మనకు అందించారు. ఏమిటా ఆస్తి? మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణము, ఇంద్రియములతో కూడిన శరీరము. ఈ దేహమే మనకు తల్లితండ్రులు ప్రసాదించిన గిఫ్ట్. భగవంతుడు మన ప్రాణమునకు అధికారి అయినప్పటికిని మన దేహమునకు అధికారులు తల్లితండ్రులే! భగవంతుడు పంచభూతములను సృష్టించాడు. అందుకు కృతజ్ఞత తెలపాలి. ఎందుకోసమని ప్రశ్నించవచ్చు, ఆధునిక విద్యార్థులు. యీనాడు నీవు నీయొక్క తల్లితండ్రులను ఎంత ఆనందపరుస్తావో, దుఃఖపరుస్తావో, రేపటి దినము నీకు నీ బిడ్డలు ఆ విధముగానే సుఖదుః

sri sathyasai vachanamrutam

ఖములను అందిస్తారు. కాబట్టి భవిష్యత్తులో నీవు మంచిని, ఆనందమును పొందాలనుకున్నప్పుడు వర్తమానములో నీ తల్లితండ్రులను గౌరవించాలి. అదే రిఫ్లెక్షన్, రియేక్షన్, రీసౌండ్. ఇందులో అలక్ష్యము చేయరాదు.

**అందము ప్రాయము ఇంద్రియశక్తియు**
**ఉందని నిక్కకురోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే**
**ముసలితనమ్మను ముసుళ్ళ పండుగ ॥తై తై॥**

**మసలలేవు కనుమసకలు మోమున**
**ముడతలు పడె తల నెరిసెనుగా**
**ముసలి కోతియని పసివారలు నిన్**
**ముసిముసి నవ్వగ కసరే బొమ్మా ॥తై తై॥**

అందము, బలము, ధనము, అధికారము, కీర్తి, ప్రతిష్ఠలు చూసి అహంకారము చెంది విఱ్ఱవీగరాదు. ఈ శక్తిసామర్థ్యములు ఎప్పటికి వుండేవికావు. ఈ అందము, యవ్వనము, శరీరము శాశ్వతము కాదు. ఈ సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాము. జీవితము గడిచిపోతున్నాది. ప్రాపంచిక సుఖములో లీనమైపోతున్నావు. ఇవన్నియు క్షణభంగురములు. ఇలాంటి జీవితము మనము ఎంత మాత్రము ఆశించరాదు.

**వ్యక్తి బాగుపడితే సమాజము బాగుపడుతుంది**

శంకరాచార్యులుకూడా చెప్పారు. ఈ చర్మముపైన నీకు ఎంతకాలము అధికారమున్నది? భుజబలము, ధనబలము, శరీరబలము కదిలిపోతున్నాయి, మేఘములవలె. ఇవన్నింటిని నమ్ముకొని సత్యము, నిత్యము అయినటువంటి దైవబలాన్ని విస్మరిస్తున్నావు. ఎన్ని జన్మములెత్తినప్పటికిని దైవత్వాన్ని పొందక తప్పదు. దైవత్వాన్ని పొందక యీ జగత్తులో మనకు ఆనందము లభించదు. గొప్ప భవనములు కట్టుకోవచ్చు, ఏసీలు పెట్టుకోవచ్చు. మొదటలో హాయిగా వుంటుండాది. దేహము చల్లబడుతుండాది.

srisathyasaivachanamrutam

మనసు వేడెక్కుతుండాది. ఏనాటికి మనకు కనువిప్పు లభించదు. కేవలము దైవానుగ్రహమువలన మాత్రమే మనకు ఆనందము లభిస్తుంది. కనుక, ఈ మానవ జీవితము సార్థకము గావించుకోటానికి మొట్టమొదట దైవానికి మనము కృతజ్ఞత తెలపాలి. కాని ఆధునిక కాలమునందు తల్లితండ్రులే పిల్లలను పాడుచేస్తున్నారు. విచ్చలవిడిగా స్వతంత్రాన్ని యిస్తున్నారు. అనవసరమైనటువంటి అవకాశములు, సదుపాయములు యిస్తున్నారు. తప్పులకు దండించడంలేదు. పాపాలను దూషించటంలేదు. వారు చేసే అన్యాయములకు, అక్రమాలకు, ప్రవర్తనలకు కొంతవరకు అడ్డంకులు వేయాలి. క్రమశిక్షణలేని పిల్లలను ఏమాత్రము క్షమించరాదు. పుత్రప్రేమ ఉండాలి, కాని ధృతరాష్ట్రునివలె గుడ్డిప్రేమ యుండరాదు. దుర్యోధనాదులు ఎటువంటి అన్యాయములు, అక్రమాలు చేసినప్పటికి అన్నింటిని క్షమిస్తూపోయాడు, ధృతరాష్ట్రుడు కృష్ణుని బోధకూడను తిరస్కరించాడు. నా పుత్రులు గొప్పవారని విఱ్ఱవీగాడు. పుత్రులు లేకపోతే పున్నామ నరకాన్ని పొందుతామని అనుకుంటారు, కొందరు. కౌరవులు వందమంది పుట్టారు; కాని, చివరకు ఎటువంటి దుర్గతి పట్టింది?

**పుత్రోత్సాహము తండ్రికి**
**పుత్రుడు జన్మించగానే పుట్టదు**
**జనులు ఆ పుత్రుని కనుగొని పొగడ**
**పుత్రోత్సాహము నాడు.**

పుత్రుడు పుట్టినప్పుడు కాదు ఆనందించవలసింది. ఏనాడు సత్కీర్తి తెస్తాడో ఆనాడు ఆనందించాలి. కాని ఈనాడు పుత్రుడు పుట్టాడంటే పెద్ద ఆనందముగా వుంటుంటారు. పుట్టగానే స్వీట్సు పంచుతుంటారు. మనకు జన్మనిచ్చినందుకు తల్లితండ్రులను సంతృప్తిపరచాలి. తల్లినుండి మనము ఏమీ ఆశించకూడదు. ప్రేమను మాత్రమే కోరాలి. ఆ ప్రేమయే దైవత్వముగా మారిపోతుంది. కేవలము ఆస్తులు మాత్రమే కోరినటువంటి దుర్మార్గులైన పుత్రులు చచ్చినవారితో సమానము. ఆదర్శమైన పుత్రుడుగా తయారుకావాలి. పిల్లలను సన్మార్గములో పెట్టడానికి తల్లులు కృషి చెయ్యాలి. వ్యక్తి బాగుపడితే సమాజము

srisathyasai vahini

బాగుపడుతుంది. సమాజము బాగుపడితే దేశము బాగుపడుతుంది. దేశము బాగుపడితే విశ్వమంతా బాగుపడుతుంది. దేశాభివృద్ధి వ్యక్తిపై ఆధారపడివుంటున్నాది. భగవదనుగ్రహము వలననే ఇది సాధ్యమవుతుంది. చిన్నవయసునుండే భక్తిని పెంచుకోవాలి. మన పిల్లలను చూచి బయటివారు విమర్శిస్తుంటారు, 'ఏమిటిరా! నీకు సాయిబాబా పిచ్చి పట్టిందా', అని అంటుంటారు. రౌడీగా, గూండాగా తయారై ధనమును సంపాదించు కోవాలనుకుంటున్నావా' ఆ ధనము పాడు ధనము. మేఘములవలె వస్తుంది, పోతుంది. శాశ్వతము కాదు. దైవానుగ్రహమే నిజమైన ధనము. దైవప్రేమయే నిజమైన ధనము. అటువంటి ధనమును కోరాలి గాని యీనాడు లౌకిక ధనమును కోరుతున్నారు. తల్లి తన రక్తము ధారపోసి మనకు జన్మనిస్తుంది. కనుక ఆ ఋణము తీర్చుకోవాలి. మనము రక్తాన్ని ధారపోయనక్కరలేదు, దేహాన్ని దైవానికి అర్పితము గావించినపుడు తల్లి సంతోషిస్తుంది. దైవార్పితముకొరకు తల్లినైనా, తండ్రినైనా, గురువునైనా, సోదరులనైనా, భర్తనైనా త్యజించమన్నారు. సర్వులకు దైవమే ఆధారము. అటువంటి దైవాన్ని విస్మరించి దయ్యాన్ని పట్టుకుని బాధపడుతున్నాము. మానవుడుగా పుట్టినందుకు, మానవుడుగా పెరిగి, మానవుడుగా జీవించి, మానవుడుగా సార్థకము కావాలి. అదే దైవత్వము. కాని, యీనాడు మానవుడు పశువుగా ప్రవర్తిస్తున్నాడు. 'మా-నవ' అనగా నీవు కొత్తవాడవు కాదు, పాతవాడవే! 'మా-న-వ' అనగా తిరిగి పుట్టుక లేనివాడవే! 'మా' అనగా అజ్ఞానము 'న' అనగా లేకుండా 'వ' అనగా వర్తించుట. అనగా అజ్ఞానము లేకుండా జీవించటమే! 'మాతానాస్తి, పితానాస్తి' అన్నారు. కాని, దేహము వుండినంతవరకు వారికి సేవ చేయాలి. అందరిలోను దైవాన్ని చూడాలి. ఈ రెండింటియొక్క ఏకత్వాన్ని మనము అనుభవించాలి. మన అంత్యకాలములోపల శాంతిని అనుభవించాలంటే నిత్యజీవితములో సక్రమమైన మార్గములో ప్రవర్తించాలి. అదే దైవచింతన. నీవు ప్రపంచములో ధనాన్ని, అధికారమును, పదవులను సంపాదించుకోవచ్చును. తప్పులేదు. అయితే, అన్నియు భగవత్ప్రీత్యర్థంగా భావించాలి. ప్రేమతో అనుభవించాలి.

**(తేదీ 06-05-1987న కొడైకెనాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vacanamrutam